అంతులేని నిర్లక్ష్యం..

- కేరాఫ్ బ్రాడీపేట 4వ లైను
- రోడ్లు గుంతలమయం...
- సెల్లార్లలోనే వ్యాపారాలు..
- సగానికి పైగా ఆక్రమణలు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న స్థానికులు, వ్యాపారులు


బ్రాడీపేట 4/14 కూడలిలోని రోడ్డు పరిస్థితి

గుంటూరు వెస్ట్: నగరంలోనే అతి ఖరీదైన వ్యాపార సముదాయాలున్న ప్రాంతాల్లో బ్రాడీపేట ఒకటి. 1905లో అప్పటి బ్రిటీష్ కలెక్టర్ ఎస్ఎస్ బ్రాడీ పేరుమీద ఏర్పడిన ఈ ప్రాంతానికి ఘన చరిత్రే ఉంది. ఇక్కడ అభివృద్ధి మాటే లేదు. ఈ ప్రాంతం పట్టణంలో ఖరీదైన బంగారు, వజ్ర వ్యాపారాలతో పాటు అనేక వాణిజ్య సంస్థలకు పెట్టిందిపేరు. వ్యాపారం అయితే మూడు పువ్వుల ఆరుకాయలుగా విరాజిల్లుతున్నా మౌలిక వసతులు మాత్రం అంతంత మాత్రంగానే ఉన్నాయి. సుమారు 30 సంవత్సరాలుగా ఎటువంటి మరమ్మతులకు 4వ లైను నోచుకోలేదని స్థానికులు వాపోతున్నారు. అడుగుకొక గుంత. అస్తవ్యస్త డ్రైయిన్లు, వర్షం పడినా, కాలువలు పొంగినా రోడ్లపైకే మురుగు నీరు చేరుతోంది.

ట్రాఫిక్ చిక్కుముడి..

ముఖ్యంగా ట్రాఫిక్ సమస్యకు ఇక్కడ పరిష్కారం లభించడం లేదు. బ్రాడీపేట నివాసితులుగాని, క్రయవిక్రయాలకు వచ్చే వారు గాని శంకర్ విలాస్ మెయిన్ రోడ్డుకు వెళ్లాలంటా 4వ లైను ద్వారానే వెళ్లాల్సి ఉంటుంది. అయితే 4/1లో చిరువ్యాపారుల కారణంగా విపరీతమైన రద్దీ ఉంటుంది. ఇక్కడ ఎప్పుడూ కనీసం కానిస్టేబుల్ కూడా కనిపించడం లేదు. దారిపొడవునా చిరు వ్యాపారులు అటు ఇటు సగానికి పైగా రోడ్డును ఆక్రమించారు. అధికారులు తీసుకుంటున్న చర్యలు మొక్కుబడిగానే ఉంటున్నాయి. దీర్ఘకాలిక ప్రణాళికతో చర్యలు చేపట్టకపోవడం ఒకటైతే, కొందరు వ్యాపారులు తమ స్వార్థ ప్రయోజనాలకోసం పార్కింగ్‌కు వదలాల్సిన సెల్లార్లలో సొంత వ్యాపారాలు చేసుకోవడం కూడా ఒక కారణంగా స్థానికులు చెబుతున్నారు.

సెల్లార్లపై చర్యలేవి

ఒక్క బ్రాడీపేట 4వ లైన్లోనే దాదాపు 20 షాపింగ్ కాంప్లెక్స్‌ల సెల్లార్లలో దుకాణాలు ఏర్పాటు చేసి వ్యాపారం చేస్తున్నారు. గతంలో కొందరు అధికారులు సెల్లార్లలో దుకాణాలు కూల్చేందుకు ప్రయతించగా స్థానిక ప్రజాప్రతినిధులు అడ్డంపడ్డారని స్థానికులు అంటున్నారు. దీనివల్ల దుకాణ యజమానులు సైతం తమ వాహనాలను రోడ్డుపైనే పార్క్ చేస్తున్నారు. ఇక కొనుగోలు దారులకు మరో మార్గమేలేకపోవడంతో వారిది అదే స్థితి. వ్యాపారులకు కొందరు ప్రజాప్రతినిధులు వంత పాడడంతో ఎన్నో ఏళ్ళుగా ఈసమస్య సమస్యగానే మిగిలిపోతుంది.

పరిష్కారాలున్నాయి..

ట్రాఫిక్ పోలీసుల పర్యవేక్షణ దాదాపుగా కరువైంది. రోడ్లు విస్తరిస్తే మంచి ఫలితాలుంటాయి. సెల్లార్లలో పార్కింగ్ చేసే విధంగా వ్యాపారులను ప్రోత్సహించాలి. ఖాళీ స్థలాల్లో పెయిడ్ పార్కింగ్ సౌకర్యం కల్పించడం. రోడ్లు కబ్జాకు గురికాకుండా నిరంతర పెట్రోలింగ్ చేయడంతో పాటు స్థానికంగా వ్యాపారులతో, స్థానికులతో ట్రాఫిక్ నియంత్రణ సంఘాన్ని ఏర్పాటు చేస్తే మంచి ఫలితాలుంటాయి. పోలీస్, మున్సిపల్ అధికారుల సమన్వయం ఎంతో కీలకం.

ఎప్పుడు మారుతుందా అని ఎదురు చూస్తున్నా



నేను దాదాపు 30 ఏళ్లకు పైగా ఇదే ప్రాంతంలో వ్యాపారం చేస్తున్నా. రోడ్డు వెడల్పని చెప్పి పాతికేళ్లయింది. వెడల్పు సంగతి దేవుడెరుగు కనీసం బాగు చేయడం కూడా మానేశారు. ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం చూపడంలేదు. పదేళ్ల నుంచి బ్రాడీపేట ప్రాంతంలో వ్యాపారాలు పెరిగాయి, రాకపోకలు అధికమయ్యాయి. దీనిని గుర్తించి రోడ్డు విస్తరించడంతో పాటు, ట్రాఫిక్ సమస్యలు పరిష్కరించాలి.

– జి.కాంతారావు, స్థానిక వ్యాపారి

క్లుప్తంగా

వైద్యానికి వేద సీడ్స్ ఆర్థిక సాయం



కొరిటెపాడు: కుంచనపల్లి గ్రామానికి చెందిన బి.శ్రీనివాసరావు అనే వ్యక్తి వైద్య ఖర్చుల నిమిత్తం వేద సీడ్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పి.చంద్రశేఖర్ రూ.15 వేలు కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఎండీ డా.చంద్రశేఖర్ మాట్లాడుతూ వాహనాలు నడిపేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, తప్పనిసరిగా హెల్మెట్ వాడాలని, సీట్ బెల్ట్ ధరించాలని తెలిపారు. ఈ నెల 3న కాజా టోల్ గేట్ వద్ద శ్రీనివాసరావుకు యాక్సిడెంట్ అయిందని, మెరుగైన వైద్యం కోసం నగరంలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో చికిత్స చేయిస్తున్నామని కుటుంబసభ్యులు తెలిపారు. కార్యక్రమంలో వేద సీడ్స్ హెచ్ఆర్ జీఎం తోట రంగారావు, ప్రొడక్షన్ జీఎం గుడి సతీష్ కుమార్, పీఆర్ఓ ఇక్కుర్తి వెంకటేష్, గాజుల సాయిరాం పాల్గొన్నారు.

వేద పండితులకు సత్కారం

నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ ధార్మిక ప్రాంగణం ఆవరణలో స్వస్తిశ్రీ చాంద్రమాన శ్రీక్రోధి నామ సంవత్సర ఆశ్వయుజ మాస సప్తమి మూలా నక్షత్రం సందర్భంగా 200 మందికి పైగా వేద పండితులను బుధవారం సత్కరించారు. బొల్లేపల్లి సత్యనారాయణ, లలితాంబ దంపతులు 1976 నుంచి దసరా నవరాత్రుల్లో మూలా నక్షత్ర పర్వదినాన జిల్లాలోని వేద పండితులను సత్కరించడం సంప్రదాయంగా పాటిస్తున్నట్లు తెలిపారు. అనేక మంది ఘనాపాటీలు హాజరై, వేద పారాయణలు చేసి బొల్లేపల్లి దంపతులకు వేదాశ్వీరచనాలు అందజేశారు.

పట్టాభిపురం ఎస్ఐగా తరంగిణి బాధ్యతలు స్వీకారం



లక్ష్మీపురం: పట్టాభిపురం ఎస్ఐగా పర్వతాల తరంగిణి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో పని చేస్తున్న మధుపవన్ పెదనందిపాడు బదిలీ కాగా ఇక్కడకు దిశ పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న తరంగిణి బదిలీపై వచ్చారు. ఎస్‌హెచ్ఓ వీరేంద్రను మర్యాదపూర్వకంగా కలసి రిపోర్ట్ చేశారు.

ఎగ్జిట్ పోల్స్ పార్టీలకు గుణపాఠం



లక్ష్మీపురం: పార్టీల నుంచి ఎగ్జిట్ పోల్స్ నిర్వాహకుల దాకా ప్రతి ఒక్కరికీ హరియాణా, జమ్మూ కశ్మీర్ ఎన్నికల ఫలితాలు గుణపాఠాలు నేర్పినట్లేనని మేధావుల ఫోరం కన్వీనర్ పి.ఎస్.మూర్తి అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఆధ్వర్యంలో బుధవారం చర్చ గోష్ఠి నిర్వహించారు. విశ్లేషకులు గుడవల్లి నాగేశ్వరరావు మాట్లాడుతూ హరియాణాలో ప్రధాని మోదీ సభలు మాటలు కొన్ని వర్గాలను ఆకర్షించాయని చెప్పారు. కాంగ్రెస్ పూర్తిగా జాట్లు, దళితుల ఓటు బ్యాంకు పైనే అతిగా ఆధారపడటం వారికి నష్టం చేసిందని పేర్కొన్నారు.

వైద్య ఉద్యోగి మృతి

గుంటూరు మెడికల్: పల్నాడు జిల్లా టీబీ విభాగంలో ఎంపీహెచ్ఎస్(మేల్) గా పని చేస్తున్న షేక్ నబీ సాహెబ్ (56) బుధవారం కన్నుమూశారు. ఇటీవల అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన గుంటూరు బావాజీ నగర్ లోని ఆయన నివాసంలో తుదిశ్వాస విడిచారు. ఆయనకు ఒక కుమారుడు, ఒక కుమార్తె. కొన్ని నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. ఆసుపత్రిలో చికిత్స పొందిన అనంతరం పూర్తిగా ఆరోగ్యం క్షీణించి మంచానికే పరిమితం అయ్యారు. గత రెండు రోజులుగా శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు పడుతున్నారు. షేక్ నబీ సాహెబ్ భౌతిక కాయాన్ని వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా సందర్శించి నివాళులర్పించారు.

గుండెపోటుతో ఎక్సైజ్ కానిస్టేబుల్..

నెహ్రూనగర్: ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖలో చిలకలూరిపేట ఎక్సైజ్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న చవల శ్రీనివాసరావు గుండెపోటుతో మృతి చెందాడు. బుధవారం ఉదయం స్టేషన్‌లో విధులకు హాజరైన శ్రీనివాసరావు(53) గుండె నొప్పి రావడంతో తోటి సిబ్బంది ఆయన్ను చిలకలూరిపేటలోని ప్రాథమిక చికిత్స అందించిన అనంతరం మెరుగైన గుంటూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకువచ్చారు..అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. ఎక్సైజ్ కానిస్టేబుల్ మృతి చెందిన విషయం తెలుసుకున్న వెంటనే డిప్యూటీ కమిషనర్ డాక్టర్ కె.శ్రీనివాస్, అసిస్టెంట్ కమిషనర్ రవికుమార్‌రెడ్డి, ఎక్సైజ్ సూపరింటెండెంట్ అరుణకుమారి, గుంటూరు నగరంలోని కొబాల్ట్‌పేట 8వ లైనులోని మృతుని ఇంటి వద్దకు వెళ్లి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ కానిస్టేబుల్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు మార్పు కోటయ్య పాల్గొన్నారు.

చిరు వ్యాపారులకు ఆర్థిక చేయూత

మెప్మా డైరెక్టర్ తేజ్ భరత్


మాట్లాడుతున్న మెప్మా డైరెక్టర్ తేజ్ భరత్

నెహ్రూ నగర్: ప్రధాన మంత్రి స్వానిధి ద్వారా చిరు వ్యాపారులకు ఆర్థిక చేయూత అందిస్తుందని, గుంటూరు నగరంలోని వీధి వ్యాపారులతో స్వానిధి వెబ్‌సైట్‌లో నమోదు చేయించాలని ఏపీ మెప్మా మిషన్ డైరెక్టర్ ఎన్.తేజ్ భరత్ ఆదేశించారు. స్వానిధి సే సమృద్ధి వారోత్సవాల్లో భాగంగా గుంటూరు నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో వీధి వ్యాపారులు, ఆర్‌పీ, సీఎంఎంలతో సమావేశం బుధవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వీధి వ్యాపారులకు ఆర్థికంగా అండగా నిలిచేందుకు కేంద్ర ప్రభుత్వం పీఎం స్వానిధి అమలు చేస్తుందని, స్వానిధిలో వీధి వ్యాపారులను నమోదు చేయడం ద్వారా వారికి ఎనిమిది రకాల సంక్షేమ పథకాలు అందుతాయని వివరించారు. ఆర్‌పీలు తమ పరిధిలోని వీధి వ్యాపారులకు పథకంపై అవగాహన కల్పించి ఈ నెల 7 నుంచి 12వ తేదీ వరకు నిర్వహిస్తున్న వారోత్సవాల్లో నమోదు చేయించాలని కోరారు. వీధి వ్యాపారులు తగిన డాక్యుమెంట్స్‌తో స్వానిధిలో నమోదు కావడం ద్వారా వారికి తొలుత రూ.10 వేలు, సక్రమంగా చెల్లిస్తే తిరిగి రూ.20 వేలు, ఆ తర్వాత రూ.50 వేలు అతి తక్కువ వడ్డీ రేటుకి రుణాలను బ్యాంక్‌లు అందిస్తాయని తెలిపారు. డిజిటల్ పేమెంట్స్ ప్రోత్సహించడం ద్వారా ప్రతి నెల రూ.100 వరకు క్యాష్ బ్యాక్ వస్తుందని వివరించారు. పేదలుగా ఉండే వీధి వ్యాపారులను, వారి కుటుంబ సభ్యులను స్వానిధి వెబ్‌సైట్‌లో నమోదు చేసి వారికి ఆర్థిక భరోసాని కల్పించడానికి మెప్మా సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. జీఎంసీ పరిధిలో వీధి వ్యాపారుల కోసం వెండింగ్ జోన్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపితే తగిన తోడ్పాటుని అందిస్తామని పేర్కొన్నారు. సమావేశంలో మెప్మా పీడీ(ఎఫ్ఏసీ) టీవీ విజయలక్ష్మి, జీఎంసీ డిప్యూటీ కమిషనర్ డి.శ్రీనివాసరావు, డిప్యూటీ మేయర్ షేక్ సజిల, ఉపా సెల్ పీఓ బాలాజీ బాషా, సీడీపీఓ కృష్ణవేణి పాల్గొన్నారు.

మోటారు సైకిల్ దొంగ అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న నగరంపాలెం సీఐ వీరానాయక్, ముసుగులో నిందితుడు వెంకటేష్

లక్ష్మీపురం: మోటారు సైకిల్ చోరీకి పాల్పడుతున్న నిందితుడిని బుధవారం రాత్రి నగరంపాలెం పోలీసులు అరెస్ట్ చేశారు. నగరంపాలెం సీఐ వీరానాయక్ తెలిపిన వివరాలు.. ఈనెల 5వ తేదీన పోలీస్ స్టేషన్ పరిధిలో ఐటీసీలో ఇంజినీర్‌గా విధులు నిర్వర్తిస్తున్న వ్యక్తి రోజు మాదిరిగానే ఉదయం వాహనాన్ని పార్కింగ్ ప్రదేశంలో పెట్టారు. తిరిగి సాయంత్రం పని ముగించుకుని వచ్చి చూస్తే పార్కింగ్ ప్రదేశంలో వాహనం కనిపించలేదు. చుట్టు పక్కల పరిశీలించి అదే రోజు నగరంపాలెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. వాహనాలు చోరీకి పాల్పడే వ్యక్తి కోసం సీఐ వీరానాయక్ ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. పోలీసుల దర్యాప్తులో ద్విచక్రవాహనాలను చోరీ చేసిన వ్యక్తి పలకలూరు రోడ్డులోని రత్నగిరి నగర్ ప్రాంతానికి చెందిన వెలుగోలు వెంకటేష్‌గా గుర్తించి బుధవారం వెంకటేష్‌ను ఎస్ఐ రామాంజనేయులు అదుపులో తీసుకుని అతని వద్ద ఉన్న మూడు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించి అరెస్ట్ చేసినట్లు వివరించారు.

సరస్వతీ నమస్తుభ్యం

నగరంపాలెం: దేవీ శరన్నవరాత్రులు బుధవారానికి ఏడో రోజుకి చేరాయి. లోక కల్యాణార్థం భక్తుల అభీష్టం మేరకు జనవాళికి కన్నుల పండువగా ఉత్సవాలు జరుగుతున్నాయి. కొన్ని దేవాలయాల్లో అమ్మవార్లను సరస్వతీదేవీగా అలంకరించారు. భక్తులు, విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకుంటున్నారు.
గుంటూరు ఎడ్యుకేషన్: మల్లికార్జునపేటలోని గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి దేవస్థానంలో బుధవారం అమ్మవారు సకల విద్యా ప్రదాయని శ్రీసరస్వతీదేవిగా దర్శనమిచ్చారు. ఈసందర్భంగా విద్యార్థులు సరస్వతీదేవి పూజా కార్యక్రమంలో భక్తి, శ్రద్ధలతో పాల్గొన్నారు.


బృందావన్‌గార్డెన్స్ శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థానంలో సరస్వతీ పూజలో విద్యార్థులు


రవీంద్రనగర్ రామలింగేశ్వర స్వామి ఆలయంలో సరస్వతీదేవీగా..



మల్లికార్జునపేట శివాలయంలో సరస్వతీదేవిగా అమ్మవారు..


ఎస్‌వీఎన్‌కాలనీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో సరస్వతీదేవిగా..


వికాస్‌నగర్ షిరిడిసాయి మందిరంలో పూజలు


బృందావన్‌గార్డెన్స్ శ్రీవెంకటేశ్వరస్వామి దేవాలయంలో..


బ్రాడీపేట శంకర మందిరంలో సరస్వతీదేవి అలంకారం


కృష్ణనగర్ ఒకటో వీధిలోని శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థానంలో..


చుట్టుగుంట శ్రీపోలేరమ్మతల్లి దేవస్థానంలో..


వికాసనగర్ 11వ వీధి షిరిడి సాయి మందిరంలో..


కొరిటెపాడు శ్రీకోదండ రామాలయంలో సరస్వతీదేవిగా..


అరండల్‌పేట శ్రీలక్ష్మీ నారాయణస్వామి దేవస్థానంలో..


ఏటీ అగ్రహారం దత్త సాయి సత్యదేవ మందిరంలో సరస్వతీ దేవీగా..

నర్సింగ్ ఎన్నికల ప్రక్రియ ప్రారంభం


ఎన్నికల అధికారి తులసి బ్రహ్మమ్మతో నర్సింగ్ యూనియన్ నేతలు పద్మజ, సునీత

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నర్సుల సంఘం ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైంది. ఈమేరకు బుధవారం గుంటూరు కో ఆపరేటివ్ సబ్ డివిజన్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఎం.తులసి బ్రహ్మమ్మ జీజీహెచ్‌కు విచ్చేసి ఓటర్ల జాబితాను విడుదల చేశారు. ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే వారు, ఓట్లు వేయాలనుకునే వారు ఓటరు జాబితాలో తమ పేర్లు ఉన్నాయో లేవో సరిచూసుకోవాలని ఎన్నికల అధికారి కోరారు. జీజీహెచ్‌లో ఈనెల 23న జిల్లా నర్సుల సంఘం ఎన్నికలు జరుగనున్నాయి. ఎన్నికల్లో పోటీ చేసేవారు ఈనెల 14న ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేస్తామని, దాని ప్రకారం పోటీ దారులు నామినేషన్లు దాఖలు చేయాలని ఎన్నికల అధికారి తెలిపారు. 16న నామినేషన్ల స్వీకరణ, 17న నామినేషన్ల పరిశీలన, 18న నామినేషన్‌ల ఉపసంహరణ ఉంటుందని వెల్లడించారు. ఎన్నికల అధికారితోపాటు, నర్సింగ్ యూనియన్ నేతలు వెలంపల్లి పద్మజ, సునీత, ఇతరులు ఓటర్ల జాబితాను ప్రదర్శించి నర్సింగ్ సిబ్బంది అంతా ఓటర్ల జాబితాను సరిచూసుకుని ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని కోరారు. గుంటూరు జీజీహెచ్ నర్సింగ్ సూపరింటెండెంట్ కార్యాలయం ఎదుట, గుంటూరు డీఎంహెచ్ఓ కార్యాలయంలో నర్సింగ్ యూనియన్ ఓటర్ల జాబితాను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు.

ఘన వ్యర్థాల నిర్వహణపై అవగాహన



నెహ్రూనగర్: ఒడిశాలోని బాసుగై మున్సిపల్ కార్పొరేషన్‌లో ఒడిశా అర్బన్ అకాడమీలోని వికేంద్రీకృత ఘన వ్యర్థాల నిర్వహణ సెంటర్, మల వ్యర్థాల శుద్ధి కేంద్రాల పనితీరును, ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణను అక్కడి అధికారులు నగర కమిషనర్ పులి శ్రీనివాసులకు వివరించారు. స్టడీ టూర్‌లో భాగంగా బుధవారం ఒడిశా రాష్ట్రంలో కమిషనర్ పర్యటించి అక్కడ అమలు జరుగుతున్న పలు విషయాలను తెలుసుకున్నారు.

నగరంలో విద్యుత్ శాఖ విజిలెన్స్ విస్తృత తనిఖీలు

-రూ.13.80 లక్షల అపరాధ రుసుం వసూలు

కొరిటెపాడు(గుంటూరు): విద్యుత్ శాఖ విజిలెన్స్ విభాగం, ఆపరేషన్ విభాగం గుంటూరు జిల్లా పర్యవేక్షక ఇంజినీర్ కె.వి.ఎల్.ఎన్.మూర్తి ఆధ్వర్యంలో బుధవారం నగరంలోని కృష్ణనగర్, లక్ష్మీపురం, బృందావన్ గార్డెన్స్ తదితర ప్రాంతాల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో 4,802 సర్వీసులు తనిఖీ చేశారు. అదనపు విద్యుత్ వాడుకుంటున్న ఇద్దరికి రూ.30 వేలు, అనుమతించిన లోడు కంటే అదనంగా విద్యుత్ వాడుతున్న మరో 275 మందికి రూ.13.50 లక్షలు మొత్తం కలిపి రూ.13.80 లక్షలు అపరాధ రుసుం విధించారు. ఈ సందర్భంగా ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు సీహెచ్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ విద్యుత్ సర్వీసుల తనిఖీలు భారత విద్యుత్ చట్టంకు లోబడి ఉంటాయన్నారు. అపరాధ రుసుం కట్టలేని పరిస్థితుల్లో రెవెన్యూ రికవరి చట్టం ఉపయోగించి ఆస్తులు జప్తు చేయబడుతుందని చెప్పారు. విద్యుత్ చౌర్యంపై ఫిర్యాదులను పూర్తి వివరాలతో 9440812263, 9440812360 నంబర్లకు నేరుగా లేదా వాట్సప్ యాప్ ద్వారా సంప్రదించవచ్చని తెలిపారు. దాడుల్లో డీఈఈలు కె.రవికుమార్, ఎన్.గురవయ్య, ఏఈ జి.నాగరాజకుమార్ పాల్గొన్నారు.

వలంటీర్లపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలి

వలంటీర్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి చైతన్య డిమాండ్


మాట్లాడుతున్న వలంటరీ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి జంగాల చైతన్య

లక్ష్మీపురం: వలంటర్ వ్యవస్థపై ప్రభుత్వం క్యాబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకోవాలని వలంటరీ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి జంగాల చైతన్య డిమాండ్ చేశారు. స్థానిక కొత్తపేటలోని మల్లయ్య లింగం భవన్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వలంటీర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం రాకముందు వలంటీర్స్‌కు రూ.10 వేల వేతనం, ఉద్యోగ భద్రత కల్పిస్తామని ఇచ్చిన వాగ్దానం నిలుపుకోవాలని కోరారు. దసరాకు మంచి వార్త చెప్పాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వలంటీర్స్ జిల్లా కన్వీనర్ ఓ రాజేష్, వెంకటరెడ్డి, అబ్దుల్ వజీత్, నాగరాజ్, రమేష్, నజీర్ బాబు, అరుణ్, గాయత్రి పాల్గొన్నారు.

ఘనంగా అక్షరాభ్యాస వేడుకలు



గుంటూరు ఎడ్యుకేషన్: సీతారామ్‌నగర్‌లోని శ్రీసరస్వతీ కమిటీ స్కూల్లో బుధవారం దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం పాఠశాలలోని శ్రీసరస్వతీదేవి విగ్రహానికి విశేష అలంకారాలు చేశారు. మూలా నక్షత్రం సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలతో పాటు చిన్నారులకు అక్షరాభ్యాసం, విద్యార్థులతో సరస్వతీ పూజ నిర్వహించారు. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన తల్లిదండ్రులు చిన్నారులకు అక్షరాభ్యాసాన్ని చేయించారు. అక్షరాభ్యాసం చేయించుకున్న చిన్నారులకు పాఠశాల కమిటీ ఆధ్వర్యంలో పలకలు, పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి.విజయలక్ష్మి, ఉపాధ్యాయులు మానసవీణ, జయరాము, నాగమేరీ, సంగీత పాల్గొన్నారు.